ప్రజాశక్తి

ఆదివారం 25 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఉక్కు కార్మికుల సహనాన్ని పరీక్షించొద్దు

- ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఐదో రోజుకు చేరిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

వార్త మెయిన్‌లో...

ఎన్నికలు సులభతరం దిశగా సాఫ్ట్‌వేర్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తున్న నీలం సాహ్ని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేందుకుగాను ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధిచేసే దిశగా ప్రణాళికలు చేపడుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పేర్కొన్నారు. శనివారం ఆమె జివిఎంసి అధికారులతో కలిసి జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలలో ఓటర్ల నమోదు, ఓటర్ల లిస్ట్ తయారీ, సంబంధిత పోలింగ్ స్టేషన్లు, పోటీ చేయు అభ్యర్థుల వివరాలు, నామినేషన్ల జాబితా, ఎన్నికలకు సంబంధించిన తదితర ప్రక్రియలను సులభతరం చేసేందుకుగాను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నామని, అందుకు సంబంధించిన వివరాలతో కూడిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను వివరించి వాటిపై మరిన్ని అవగాహనాపరమైన సలహాలను, సూచనలను తీసుకునేందుకు ఈ సమావేశాన్ని తొలుత జివిఎంసిలో ఏర్పాటు చేశామని అన్నారు. తాజా సాఫ్ట్‌వేర్‌లోని అంశాలను ఆమె పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 1200 మందికి ఒక పోలింగ్ స్టేషన్ తయారీ, వివరాలు, రూట్ మ్యాప్ కేటాయింపు, ఓటర్ లిస్ట్ తయారీ, ఓటరు, పోటీచేయు అభ్యర్థులు స్వయంగా తమ పేరును తెలుసుకోవడం, ఓటరు డోర్ నెంబర్ సవరణ, ఓటరు వేకెన్సీ, చనిపోయిన, డిస్ క్వాలిఫై వివరాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, పోటీ చేయు అభ్యర్థుల పేర్లు, రిజర్వేషన్లు, ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ వివరాలన్నీ నూతన సాఫ్ట్‌వేర్‌లో సులభతరంగా ఉండనున్నాయన్నారు. తద్వారా ఎన్నికలు నిర్వహించు అధికారులకు, సిబ్బందికి సమయం వృథాకాకుండా ఉంటుందన్నారు. అనంతరం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అప్లికేషన్ పూర్తి వివరాలను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సెక్షన్ ఆఫీసర్ కెఎన్.కుమార్ పిపిటి ద్వారా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, అందరు జోనల్ కమిషనర్లు, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, డిసిపి రామ్మోహనరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆరోగ్యాలతో మోడీ సర్కారు చెలగాటం

వార్త 2లో..

పిల్లలకు శాస్త్రీయ దృక్పథం అలవర్చాలి

వార్త 5లో..

ఉత్తేజంగా సమైక్యతా యాత్ర

వార్త 8లో..

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

యుపిఎస్‌సి పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుపిఎస్‌సి ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ శనివారం పరిశీలించారు. ఎవిఎన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలతో పాటు, వివిధ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను గమనించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవిఎన్ కళాశాలలో ఇన్విజిలేటర్ల శిక్షణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు.

ఎవరి పాత్ర ఎంత ?

- సిఐడికి అచ్యుతాపురం సైబర్ నేరాల కేసు
- నేర మూలాలపై లోతైన విచారణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అచ్యుతాపురం కేంద్రంగా కొంతకాలం నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సైబర్ నేరాల మూలాలను ఛేదించేందుకు కేసు దర్యాప్తును క్రైమ్ ఇన్విస్టిగేషన్ డిపార్టుమెంట్ (సిఐడి)కి ప్రభుత్వం అప్పగించింది. కొంతమంది స్థానికుల సహకారం మొదలుకొని అంతర్జాతీ స్థాయి వరకూ.. అమెరికా సహా పలు దేశాలతో సంబధాలు కలిగిన ఈ నేర ముఠా రహస్య కార్యకలాపాలపై లోతైన విచారణ చేయాల్సివుండడంతో ఈ కేసును సిఐడికి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సాయం తీసుకొని ఈ నేర పునాదులు ఇక్కడ ఎప్పుడు పడ్డాయి ? దీనికి ప్రధాన సూత్రధారులెవరు ? ఇందులో భాగస్వాములెవరు ? తోడ్పడుతున్నదెవరు ? సైబర్ నేరంలో ఎవరిపాత్ర ఎంత ? స్థానికులు ఎవరెవరు సహకరిస్తూ వస్తున్నారు ? స్థానిక పోలీసులు ఈ నేర ముఠాను ఎందుకు గుర్తించలేకపోయారు ? గుర్తించినా తెలియనట్లు వున్నారా ? అనే పలు కోణాల నుంచి దర్యాప్తు చేసేందుకు ఈ కేసును సిఐడికి బదలాయించాలని ప్రభుత్వం భావించినట్లు తెలిసింది. అచ్యుతాపురం మండలం, భోగాపురం పవన్ రెసిడెన్సీలో ఫ్లాట్లను ఆద్దెకు తీసుకొని నకిలీ కాల్ సెంటర్లతో నేరాలకు పాల్పడిన 33 మందిని పోలీసులు ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కాల్ సెంటర్ ద్వారా నెలకు కోట్ల రూపాయల కార్యకలాపాలు జరిగాయి. ఎస్‌పి తుహిన్‌సిన్హాకు అందిన సమాచారంతో పరవాడ డిఎస్‌పి విష్ణుస్వరూప్ నేతృత్వంలో జరిగిన పోలీసు సోదాలతో పలువురు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించడంతో నేర రహస్య వ్యవహారం బయటపడింది. గుజరాత్, అసోం, నాగాలండ్, మేఘాలయలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలని చెప్పి ఇక్కడ సైబర్ నేరాలను వారితో చేయించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నేరాలకు మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రదారులుగా గుర్తించారు. అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలు కలిగిన ఈ నేర ముఠా మూలాలను పట్టుకొనేందుకు కేసు దర్యాప్తును సిఐడికి ప్రభుత్వం అప్పగించింది.

పెన్షనర్ల ఆరోగ్యాలతో మోడీ సర్కారు చెలగాటం

మాట్లాడుతున్న రెడ్డి వెంకటరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 40 ఏళ్లకుపైగా దేశానికి సేవచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాలతో మోడీ ప్రభుత్వం ఆటలాడుకుంటోందని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు విమర్శించారు. సిజిహెచ్ ఎస్‌లో సమస్యలపై శనివారం డాబా గార్డెన్స్‌లోని వెల్‌నెస్ సెంటర్ వద్ద ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ చివరి వారం నుంచి వైద్య సేవలు పొందే విషయంలో సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత నెల వరకు ఎన్ఐసి మాడ్యూల్లో అందించిన వైద్య సేవలను సి డాక్ సాఫ్ట్‌వేర్‌లోకి మార్చడం, అది సక్రమంగా పనిచేయకపోవడం వల్ల దేశవ్యాప్తంగా వైద్య సేవలు పడకేశాయన్నారు. పెన్షనర్లు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులుతో పాటు సాఫ్ట్‌వేర్ పనిచేయక డాక్టర్లు, సిబ్బంది కూడా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలో మేటిగా ఉన్నామని ప్రగల్భాలు పలికే మోడీకి పెన్షనర్ల ఆరోగ్యాలు పట్టవా ? అని ప్రశ్నించారు. వైద్య సేవలు పడకేయడం కావాలని చేసిన కుట్రగానే కనిపిస్తోందన్నారు. ప్రతి నెలా రూ.వెయ్యి మెడికల్ అలవెన్సు వదులుకోవడంతోపాటు వేలాది రూపాయలను ముందుగానే చెల్లించి పథకంలో చేరినవారికి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల వైద్యం కోసం ఆసుపత్రిలో చేరిన రోగులు లక్షల రూపాయల నగదును చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో మందులు రాయడానికి డాక్టర్లు, మందులు ఇవ్వడానికి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టల్ పెన్షనర్స్ నాయకులు ఎంఆర్‌డి.రాజు, అసోసియేషన్ నాయకులు రామకృష్ణ. ఆర్.సత్యనారాయణ, చిన్నారావు పాల్గొన్నారు. సిఎంఒ ఇన్‌ఛార్జి డాక్టర్ శ్యామ్ కిషోర్ బాబు నిరసన కార్యక్రమం వద్దకు వచ్చి నిరసనకారుల సమస్యలను విన్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

ఎన్‌టిఆర్ జయంతిని ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ జయంతిని 'తెలుగువారి ఆత్మగౌరవ దినోత్సవం'గా ప్రకటి దీనిపై ప్రభుత్వం సోమవారంలోగా జిఒ విడుదల చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. శనివారం మేఘాలయ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదైనా ఎన్టీఆర్ జయంతిని ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలని కోరారు. ఎన్టీఆర్‌ను ఇప్పటికీ పార్టీలకు అతీతంగా గౌరవిస్తారన్నారు. ఈ నెల 27న బొబ్బిలిపులి ఆడియో విడుదల ఉంటుందని ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రజాప్రగతి కోసమే తన పోరాటం అన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పట్టవా ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా, జర్నలిస్టులకు కనీసం అక్రిడేషన్ వంటి గుర్తింపుకార్డులు కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, జర్నలిస్టుల పిల్లల ఫీజుల కోసం రూ.10 వేలు అందజేశారు. ప్రజాఫోకస్ రిపోర్టర్ బాషా కుమార్తె కళాశాల ఫీజు నిమిత్తం రూ.5 వేలు, మరొక ప్రముఖ జర్నలిస్టుకు రూ.5 వేలు సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు పాల్గొన్నారు.

సమస్యలపై సిహెచ్‌ఒల దర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎన్.ఎస్ ప్రజ్ఞ మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయాలన్నారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంట సుధ, మోజెస్, జస్వంత్, కల్పన, సుధా, మణి పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం / దేవీపట్నం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ప్రభుత్వం రివ్యూ సమావేశం నిర్వహించి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శనివారం పోలవరం ప్రాజెక్టును వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవీపట్నం, చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలోని 222 పంచాయతీల్లో 373 గ్రామాల్లో 1,06,006 కుటుంబాలు నీట మునుగుతున్నాయని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బ్యాక్‌వాటర్ పెరుగుతుండడంతో భవిష్యత్‌లో ముంపు మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉక్కుపై మోసం.. దగా.. కుట్ర..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల సమయంలో చెప్పే వాటికి... వాస్తవ రాజకీయాల్లో చేసే పనులకు ఏ మాత్రమూ పొంతన ఉండదన్నది 'కూటమి'లోని పార్టీలను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. గత ఎన్నికలకు ముందు విశాఖపట్నం అంటేనే స్టీల్‌ప్లాంట్... స్టీల్ ఫ్యాక్టరీ అంటేనే విశాఖపట్నం అనేలాగ టిడిపి అధినేత చంద్రబాబు సహా ప్రస్తుత విశాఖ ఎంపీ శ్రీభరత్, స్థానిక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాస్ అంతా కలిసి ఈ ప్రాంత కార్మికులు, వారి కుటుంబాల ఓట్ల కోసం అర్రులు చాచారు. నానా విధాలుగా ప్రగల్భాలు పలికారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల కోసం తన ఎంఎల్ఎ పదవికి రాజీనామా అంటూ 2024 ఎన్నికలకు ముందు అప్పటి ఉత్తరం ఎంఎల్ఎ గంటా శ్రీనివాసరావు నమ్మబలికారు. 2024 ఎన్నికల్లో భీమిలి నుంచి ఆయన ఎంఎల్ఎగా గెలిచాక ప్లాంట్ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదంటే 'కూటమి' నేతల నైజం ఏమిటో ఇట్టే స్పష్టమవుతోంది.

ఇప్పుడెలా ఉన్నారంటే.. ?

'ఏమో.. తెలీదు.. గుర్తులేదు.. మరచిపోయాం'...అన్నట్టుగా కూటమి నేతల తీరు కనిపిస్తోంది. అప్పటి మాటలను గాలికొదిలేశారు. దేశ ప్రధాని మోడీ జూన్ 21న విశాఖకు యోగా డేకి వస్తుంటే ఆ ఏర్పాట్లలో కూటమి నేతలంతా అహర్నిశలూ శ్రమిస్తున్నారు. నిన్న గాక మొన్న హనుమాన్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీలు చేసి వార్డు వార్డులోనూ హోరెత్తించారు.

తాజాగా విశాఖ సాగర తీరంలో ఆయోధ్య రామాలయం నమూనా పేరుతో ఉపన్యాసాలు దంచుతున్నారు. అవి తప్పితే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సమస్య వారికి పట్టడం లేదు. కొద్ది కాలం వ్యవధిలోనే నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం అడ్డగోలుగా తొలగించిన సంగతిని పట్టించుకోవడం లేదు. అధికారం చేతికి దక్కడంతో మరలా నాలుగేళ్ల తర్వాత చూద్దాం అన్నట్టుగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు.

ఉక్కు పరిశ్రమలో ఏం జరుగుతోంది?

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంలోనే ఉక్కులో నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. కేంద్రంలోని బిజెపి, స్టీల్ యాజమాన్యం కలిపి ప్లాంట్‌లోగల 1213 మంది పర్మినెంట్ కార్మికులకు విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించేశారు. ఎన్నికలకు ముందు ఉక్కుపై వీరంగం వేసిన పవన్ కల్యాణ్ నేడు ప్లాంట్ సమస్యను కన్నెత్తి చూడటం లేదు. ఈ నెల 20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే ఆయనకు పట్టడం లేదు.

కేంద్ర విధానంతో కూటమి పార్టీల కుమ్మక్కు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల క్రితమే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని నిర్ణయించింది. ఈ కాలంలో నెమ్మదిగా ఉక్కులోని విభాగాలను నిర్వీర్యం చేస్తూ వచ్చింది. కార్మికులను తగ్గించింది. అక్రమ తొలగింపులపై నేడు కాంట్రాక్టు కార్మికులు సమ్మె బాట పట్టారు. ఇంత జరుగుతున్నా అధికార పదవుల పంపకాల్లో కూటమి నేతలు విశాఖలో నిమగ్నమయ్యారు తప్ప కార్మికుల గోడును పట్టించుకోలేదు. ఈ వైఖరిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్ఫూర్తిగా నిలిచిన జక్కాన కుటుంబం

సోములు పార్థివ దేహం ఎంసికి అప్పగింత

సోములు పార్థివ దేహాన్ని ఎంసికి అప్పగిస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు యూనియన్ (సిఐటియు) నాయకులు జక్కాన సత్యనారాయణ మామ సబ్బవరపు సోములు అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. ఆయనది సబ్బవరం మండలం రావలమ్మపాలెం గ్రామం. ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనాటమీ డిపార్టుమెంట్‌కు వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కుటుంబీకులు అందజేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. సోములుకు రాములమ్మ, దేముడమ్మ అను ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి కుటుంబమంతా అంగీకారం తెలిపి పార్థివ దేహాన్ని దానం చేశారు. సోములు అల్లుడు జక్కాన సత్యనారాయణ సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యునిగా ఉన్నారు. విడిఎల్‌బి, డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. వారి కుటుంబం మొదటి నుంచీ ఆదర్శప్రాయంగా ఉంది.

సోములు పార్థివ దేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పి.మణి, జిల్లా నాయకులు బి.రమణి, బి.వెంకటరావు సందర్శించి నివాళ్లర్పించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ సోములు కుటుంబం ఎంతో ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గ్రేస్ పాల్గొన్నారు. జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా సోములు పార్థివదేహాన్ని డొనేట్ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గట్టు సుబ్బారావు, ఎంవి.నారాయణ, పోర్టు సిఐటియు యూనియన్ నాయ కులు కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పూడి పైడిరాజు, జి.ఎర్నాయుడు పాల్గొన్నారు.

నేడు మీడియా ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: వైజాగ్ మీడియా అవార్డ్స్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామని నిర్వాహక కమిటీ చైర్మన్ గంట్ల శ్రీనుబాబు, చీఫ్ ఆర్గనైజర్ ఆర్.నాగరాజు పట్నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సిరిపురం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగే ఈ కార్యక్రమంలో ఎంబిఎ, ఎంబిబిఎస్, ఎంఎల్, బిఎల్ నర్సింగ్, ఇంజినీరింగ్ చదువుతున్న 33 మందికి, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, డ్యాన్స్, మ్యూజిక్ వంటి విభాగాల్లో మరో పది మంది జర్నలిస్టుల పిల్లలకు కలిపి మొత్తం 40 మందికి ఈ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. అదేవిధంగా జర్నలిస్ట్ పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామని తెలిపారు.

న్యాయసేవలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : తప్పిపోయిన పిల్లల కోసం అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, న్యాయసహాయం గురించి ప్రజలకు, తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు స్పష్టం చేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మహిళా శిశసంక్షేమశాఖ సహకారంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సన్యాసినాయుడు అధ్యక్షత వహించారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. 75/2024 మరియు I.A. 243/2024

వాది (పిటిషనర్):
అనపర్తి అప్పలరాజు
ప్రతివాది (రెస్పాండెంట్):
కుసుమంచి సతీష్
టు: ప్రతివాది (రెస్పాండెంట్):
శ్రీ కుసుమంచి సతీష్,
తండ్రి నూకయ్యశెట్టి, కొరుప్రోలు గ్రామం,
ఎస్.రాయవరం మండలం,
అనకాపల్లి జిల్లా.

పైనెంబరులో వాది గారికి మీరు చెల్లించ వలసిన ప్రోమిస్సోరీ నోటు బాకీ వసూలు నిమిత్తం మీ పై O.S.75/2024న దావాయున్నా, సదరు దావా బాకీకి హామీ కోరుచూ మీతాలుకు స్థిరాస్తిని ప్రథమ జప్తు కోరుచూ I.A.243/2024న వేరే పిటిషన్నూ దాఖలు చేయగా పై రెండు వ్యాజ్యములు మీకు నోటీసులు నిమిత్తం **తేది:16-6-2025కి** వాయిదా వేయించిరి. కావున మీరు పై తేదిని **ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై అందు మీకు గల ఆక్షేపణలు శ్రీకోర్టు వారికి మనవి చేయవలయును. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

యలమంచిలి
తేది: 24-5-25

డబ్బీరు ఉమాశంకర్,
వాది తరపు అడ్వకేట్

మహారాజశ్రీ గౌరవనీయులైన 1వ అదనపు జిల్లా జడ్జి విశాఖపట్నం వారి కోర్టులో విశాఖపట్నం
E.P. 3 / 2014 in O.S. 401 / 2013

బిట్వీన్:
శ్రీమతి ఆడారి బాలసరస్వతి ... డిక్రీహోల్డర్
అండ్:
ఇలకల సంధ్యారాణి ... జడ్జిమెంటు డెటార్

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా పైనెంబరు పిటీషన్ అమలులో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తము జడ్జిమెంటు డాటార్ యొక్క ఈ క్రింది షెడ్యూల్ ఆస్థిని తేది: 25-06-2025 వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున వేలముపాటలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు తే:25-06-2025 ఉదయం గం. 10-30 ని॥లకు పై ఉదహరించిన మహారాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలెననియు తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్థి: విశాఖపట్నం జిల్లా, జివియంసి పరిధి, రెవెన్యూ గ్రామము, గోకుల్‌నగర్, కంచరపాలెం, ఎసెస్‌మెంటు నెం. 100004, డోరు నెం. 57-8-35, పట్టానెం. 19 సర్వే నెం. 17/1 పార్టు విస్తీర్ణము 89 చ॥గ॥లులో నిర్మించిన ఆర్‌సిసి స్లాబు కలిగిన మూడు అంతస్తుల **భవనమునకు హద్దులు: తూర్పు:** ఆర్.సి.సి.స్లాబ్ ఇల్లు అచ్చిబాబుకు సంబంధించిన, **దక్షిణం:** కె.చిన్నారావుగారి ఆర్.సి.సి.స్లాబు ఇల్లు, **పడమర:** కె.సాయిప్రసాద్‌గారి ఆర్.సి.సి.స్లాబ్ యిల్లు, **ఉత్తరం:** 5 అడుగుల లేన్.

కోర్టు అమీను గారి ఉజ్జాయింపు విలువ : రూ. 40,80,000/-
డిక్రీ హోల్డరుగారి ఉజ్జాయింపు విలువ: రూ. 13,00,000/-
వేలం తేది: 25-06-2025
టైం: 10-30 ని॥లకు
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

BOTSA YERAKAYYA NAIDU (Rajesh) MA., LLB.
Advocate for Decree Holder
Visakhapatnam. Cell : 7386010249

రైతు బజారు ఏర్పాటుతో...

సామాన్యులకు ఊరట

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి పాత మీ సేవా కేంద్రం సమీపంలో 1837.82 చదరపు గజాల విస్తీర్ణంలో మార్కెటింగ్ శాఖ నిధులు రూ.78 లక్షలతో నిర్మించిన రైతు బజారు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమైంది. 27 చిన్న, 4 పెద్ద దుకాణాలు, వేలం పాట ద్వారా కేటాయించిన 5 కమర్షియల్ దుకాణాలు, 3 గదులు, రెండు టాయిలెట్లతో కూడిన రైతు బజారు సముదాయంలో బుధవారం కూరగాయల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. మొత్తం 31 దుకాణాల్లో డ్వాక్రా మహిళలకు 3, వికలాంగులకు ఒకటి చొప్పున కేటాయించారు. వికలాంగులకు, డ్వాక్రా మహిళలకు కేటాయించిన దుకాణాల వద్ద ఉల్లిపాయలు, టమోటా, బంగాళ దుంపలు లభ్యమవుతాయి. మిగిలిన కూరగాయలు 27 దుకాణాల్లో లభ్యం కానున్నాయి.

ధరల్లో తీవ్ర వ్యత్యాసం...

గత కొన్నేళ్లుగా ఇక్కడ ఉన్న ప్రయివేట్ మార్కెట్‌లో అమ్ముతున్న కూరగాయల ధరలకు, ఈ రైతు బజారులో అమ్ముతున్న కూర గాయల ధరలకు చాలా వ్యత్యాసం కనబడుతోంది. ఈ ధరల వ్యత్యాసం చూసిన వినియోగదారులు ఒక్కసారిగా విస్మయం చెందారు.

ప్రయివేట్ మార్కెట్‌లో ధరలు ఇలా...

బుధవారం స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో కూరగాయల ధరలు పరిశీలించగా.. ఉల్లిపాయలు కిలో రూ.25, బంగాళదుంపలు రూ.30, టమోటా రూ.25, నలుపు, తెలుపు వంకాయలు కిలో రూ.50, రూ.40కు అమ్మకాలు సాగించారు. బెండకాయలు, క్యారెట్, చిక్కుడు, పచ్చిమిర్చి రూ.40 చొప్పున, అల్లం రూ.80కు అమ్మకాలు సాగించారు. ఈ ధరల అమ్మకాలు ప్రైవేట్ మార్కెట్‌లో స్థిరంగా ఉండవు. రోజుకో ధర, ఇంకా చెప్పాలంటే ఒక్కో దుకాణం వద్ద ఒక్కో ధర ఉండడం సాధారణంగా జరిగే ప్రక్రియ. ఆరుగాలం కష్టపడి పండించి కూరగాయలను ఇక్కడకు తెచ్చి అమ్మిన రైతులు, కొనుక్కొంటున్న వినియోగదారులకు దళారీల భారిన పడి నష్టపోతున్నారు. కూరగాయలు అమ్మే వ్యాపారులు మాత్రం బాగా లాభపడుతున్నారు.

'ప్రయివేటు మార్కెట్'లో ఇష్టారీతిన వ్యాపారులు నిర్ణయించిన ధరలకు, కూరగాయల అమ్మకాలకు రైతు బజారు ఏర్పాటుతో ఇక బ్రేక్ పడినట్లేనని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

రైతు బజారులో ధరలు ఇలా..

స్థానిక రైతు బజారులో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. వంకాయలు కిలో రూ.36, ఉల్లిపాయలు,

రైతుబజారులో సాగుతున్న కూరగాయల అమ్మకాలు

బంగాళాదుంపలు రూ.19, పచ్చి మిర్చి రూ.24, వెల్లుల్లి రూ.80, అల్లం రూ.50, క్యారెట్ రూ.30, దొండకాయలు రూ.18, పుదీనా, గోంగూర, పాల కూర, తోట కూర రూ.3కు లభించాయి.

కూరగాయల అమ్మకాలు, ధరల పర్యవేక్షణ కోసం రైతు బజారులో ఎస్టేట్ అధికారిని ఇంకా నియమించలేదు. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మీరా భాయ్ ప్రస్తుతానికి ఆ బాధ్యతలు చూస్తున్నారు.

ధరలు తక్కువ

ప్రయివేటు మార్కెట్‌లో ఉన్న కాయగూరల ధరలకు, ఇక్కడి రైతు బజారులో ఉన్న ధరలకు చాలా తేడా ఉంది. అల్లం, బంగాళదుంపలు కొన్నాను.

పి.తాతాజీ,
తగరపువలస

సామాన్యులకు అందుబాటులో..

రైతు బజారులో కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ గోంగూర, తోట కూర చాలా తక్కువ ధరకు లభించాయి.

సిహెచ్.రాజారావు
తగరపువలస

చాలా ప్రయోజనం

ఎక్కువ శాతం మధ్య తరగతి, సామాన్య ప్రజలు ఉన్న ఈ ప్రాంతంలో రైతు బజారు ఏర్పాటు వల్ల చాలా ఉపయోగం. రైతు బజారు ఇక్కడ ఉన్నట్లు విస్తృతంగా ప్రచారం జరగాలి. ప్రయివేటు మార్కెట్‌లో కిలో ఉల్లిపాయలు రూ.25 ఉంటే, రైతు బజారులో రూ.19కే కొన్నాను.

ఎల్.వినయ్‌కుమార్
సంతపేట, తగరపువలస

నేరాలు ఘోరాలు

కాలువలో పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్నేహితులతో క్రికెట్ ఆడుకుంటానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి వెళ్లిన కుమారుడు విగతజీవిగా మారాడు. దీనికి సంబంధించి స్టీల్‌ప్లాంట్ పోలీసుల కథనం ప్రకారం...అగనంపూడి శనివాడ ప్రాంతానికి చెందిన చట్టి పైడిరాజు కుమారుడు చట్టి యశ్వంత్ (13) శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్నేహితులతో కలిసి ఆడుకొవటానికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లాడు. యశ్వంత్ అగనంపూడి సమీప ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. కాలువ నీటి ప్రవాహానికి కెబిఆర్ రిజర్వాయర్‌లోకి కొట్టుకొచ్చాడు. రిజర్వాయర్ వద్ద మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని విద్యార్థిగా పోలీసులు తొలుత భావించారు. మృతుని ఫొటో వాట్సాప్ గ్రూపులో షేర్ చేశారు. ఈ క్రమంలోనే ఆడుకుంటానని వెళ్లిన కుమారుడు సాయంత్రం అయినా ఇంటికి చేరకపోవటంతో యశ్వంత్ తండ్రి స్థానికంగా అందరినీ అడుగుతూ తిరుగుతున్నాడు. వాట్సప్ గ్రూప్‌లో వచ్చిన యశ్వంత్ ఫొటోను కొందరు చూపించడంతో తమ కుమారుడేనంటూ తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఎంత మంది ఆటకు వెళ్లారు, ప్రమాదంగానే కాలువలో జారిపడిపోయాడా, మరే ఇతర కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస ఎన్‌హెచ్-16 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పోలమాంబ గుడి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి మృతి చెందారు. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం.. సంగివలస ఆరాధ్య హాస్టల్‌లో ఉంటున్న చిప్పాడ దివీస్ ఉద్యోగి ఉప్పలపాటి తిరుమలాదేవి (24) శనివారం మధ్యాహ్నం సుమారు 12.45 గంటలకు విధులకు హాజరయ్యేందుకు సహచర ఉద్యోగి లీలా కల్యాణితో కలిసి బయల్దేరారు. రోడ్డు అవతల దివీస్ సంస్థ బస్సు ఉంది. ఆ బస్సులో డ్యూటీకి వెళ్లేందుకు రోడ్డు డివైడర్ దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న కారు తిరుమలా దేవిని బలంగా ఢీకొని, సుమారు 20 మీటర్ల దూరం ఈడ్చుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సహచర ఉద్యోగి కడియాల పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాధాకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి స్వగ్రామం కృష్ణా జిల్లా, చాట్రాయి మండలం, సోమవరం పోస్టు, కొత్త గూడెంగా పోలీసులు పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంబీరం పంచాయతీ పరిధి కాళింగ కాలనీ వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో సుమారు 100 కుటుంబాలు జీవిస్తున్నాయి. గతంలో బీసీ కాలనీ నుంచి పైపులు వేసి తాగునీటిని అందించేవారు. రెండేళ్ల నుంచి పైపుల ద్వారా నీరు రాకపోవడంతో గ్రామస్తులు సొంత బోర్లపై ఆధారపడ్డారు. ప్రస్తుతం వేసవికాలంలో బోర్లు అడుగంటడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటి సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియపరిచినా పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి చలపతిరావును వివరణ కోరగా పంచాయతీ పరిధిలోని కాళింగ కాలనీ సుదూరంగా ఉండడంతో కాలనీకి ప్రత్యేకంగా ట్యాంక్ ఏర్పాటుచేసి పైపులైన్ ద్వారా తాగు నీటిని అందించడానికి త్వరలో చర్యలు చేపడతామన్నారు.

విద్యుత్ సమస్యపై ఫిర్యాదు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధి నేరెళ్లవలస, కొయ్యిపేట గ్రామాల్లో గత కొంతకాలంగా విద్యుత్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆ గ్రామస్తులు శనివారం మండల విద్యుత్ శాఖ ఎఇ జగన్మోహన్‌రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎఇకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పశుసంవర్ధక శాఖ భూమి ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి బిఎన్ఆర్.నగర్‌లో సాయిబాబా ఆలయం పక్కన సర్వే నెంబరు 56లోని పశుసంవర్ధక శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించేందుకు రెండు రోజుల నుంచి జెసిబిలతో అక్కడ ఉన్న చెట్లను తొలగించి చదును చేయించారు. సమాచారం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ ఎన్.కరుణాకరరావు, డాక్టర్ నీలయ్య, డాక్టర్ అశోక్, సిబ్బంది ఆక్రమిత ప్రదేశానికి చేరుకొని అక్కడ జరుగుతున్న పనులను అడ్డగించారు. ఈ స్థలం పశుసంవర్ధక శాఖకు చెందినదని, ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానికులకు, సంఘాల నాయకులకు హెచ్చరించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. తోటగరువు సమీపంలో గల సింధూ అకాడమీ ఎదురుగా ఉన్న పశుసంవర్ధక శాఖకు చెందిన ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని ఏర్పాటుచేసిన బడ్డీలు, దుకాణాలను వెంటనే తొలగించాలని నిర్వాహకులను హెచ్చరించారు. వీటిపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్ సిఐ మల్లేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు.

పశుసంవర్ధక శాఖ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తున్న అధికారులు

జీవశాస్త్రం పరీక్షకు 1753 మంది హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జీవశాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2197 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 1753 మంది హాజరయ్యారని, 444 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. పదోతరగతి శాంఘిక శాస్త్రం పరీక్షకు 8 కేంద్రాల్లో 200 మంది విద్యార్థులకు 167 మంది హాజరయ్యారని, ఓపెన్ స్కూలు ఇంటర్‌లో 4 కేంద్రాల్లో జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 154 మంది విద్యార్థులకు గానూ 130 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

కృష్ణాపురం సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఓ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని పద్మనాభం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఓ మీనా కుమారి శనివారం సందర్శించారు. కృష్ణాపురం పంచాయతీలో ప్రభుత్వ సర్వేను, అంతర్జాతీయ యోగా దినోత్సవ సర్వేలను పరిశీలించారు. సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : గిడిజాల సబ్ స్టేషన్ 33/11కెవి, శొంఠ్యాం 11 కెవి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ శాఖ ఎఇ అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని శొంఠ్యాం, దిబ్బడిపాలెం, గుమ్మడివానిపాలెం, దిబ్బమీదపాలెం, నీలకుండీలు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతంలో రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, జివిఎంసి నిధులలో రిటర్నింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకటరావు, వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దిల రాజేష్, దొంతల రమణ, బండి రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

పినగాడిలో కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండలం పినగాడి పంచాయతీ పరిధిలోని సూరపనేని సుబ్రమణ్యం పంట పొలాల్లో సుమారు 12 అడుగుల పొడవు గల కొండచిలువ కలకలం రేపింది. స్థానికులు కొండచిలువను చూసి స్నేక్ కేచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు ఫోన్ చేశారు. శనివారం ఉదయం రెస్క్యూ టీమ్‌తో కలిసి కిరణ్‌కుమార్ పొలం వద్దకు చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. ఆ పొలంలో కొండచిలువ గుడ్లు కూడా ఎక్కువగా కనిపించాయి. అనంతరం కొండ చిలువను కంబాల కొండకు సురక్షితంగా తరలించారు. ఈ సందర్భంగా స్నేక్ కేచర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు తాను సుమారు 3500 పాములను పట్టుకున్నట్లు తెలియజేశారు. ఎక్కడైనా విష సర్పాలు కనిపిస్తే 8866368899 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

సనపల శ్రీనివాసమ్మ మృతి

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార ప్రాంతానికి చెందిన సనపల శ్రీనివాసమ్మ (72) అనారోగ్యంతో శుక్రవారం ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందారు. మాధవధార శ్మశాన వాటికలో శనివారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సనపల సీతా రామకృష్ణ, సనపల శ్రీకాంత్ రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మాధవధార గ్రామంలో స్వచ్ఛంద సేవా సంస్థలను ఏర్పాటుచేసి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాధవధార గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు పాల్గొని శ్రీనివాసమ్మకు నివాళులర్పించారు.

విద్యార్థినికి ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థినికి ప్రోత్సాహం

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షల్లో 584 మార్కులతో ప్రథమ స్థానం పొందిన సోపేటి శిరీషకు రూ.10 వేలు బహుమతిని పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని అల్లు వెంకటసుజాత శనివారం ప్రధానోపాధ్యాయిని సమక్షంలో అందజేశారు. తాను బోధిస్తున్న స్కూల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తుంటానని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి మాట్లాడుతూ, గత ఏడాది కూడా ఉపాధ్యాయిని సుజాత పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారని తెలిపారు. విద్యార్థిని శిరీషను, ఉపాధ్యాయులు సుజాతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి -ములగాడ : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ పశ్చిమ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాపురం జంక్షన్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలు అమలుచేయాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు జూన్ 2వ తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. ధర్నా జయప్రదానికి ఏడు వార్డుల్లోనూ ప్రచారం చేయాలని కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పోతిన రాము, గండి అప్పారావు, సుక్క సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, వై.కనకేశ్వరరావు, ఆర్.అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'స్వర్ణభారతి' అభివృద్ధి పనులు

స్టేడియం చుట్టూ కట్టి ఉన్న కర్రలు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునరాభివృద్ధి నిమిత్తం రూ.16.90 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో 2024 జనవరిలో అప్పటి జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి సుమారు ఏడాదిన్నర అవుతున్నా పనులు ముందుకు సాగడంలేదు. ఈ స్టేడియంలో జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడలు తరచూగా నిర్వహించేవారు. ఈ అభివృద్ధి పనుల వల్ల సుమారు ఏడాదిన్నరగా ఈ స్టేడియంలో క్రీడలు జరగడంలేదు. స్టేడియం లోపల బయట ఎసిపి క్లాడింగ్, చిల్లులు కలిగిన మెటల్ క్లాడింగ్, స్ట్రక్చరల్ గ్లేసిన్ వర్క్, మూడు లేయర్ల రూఫింగ్, బయట ఆట స్థానంలో ఇపిడిఎం ఫ్లోరింగ్, ప్రహరీపై మోరల్ ఆర్ట్స్ స్ట్రక్చర్ పెయింటింగ్, పార్కింగ్ స్థలంలో సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్, స్టేడియం చుట్టూ తారు రోడ్లు, రెండు స్టైర్లు స్లైడింగ్ విండోలు, టైల్స్ ఫ్లోరింగ్, రెస్ట్ రూమ్ తదితర పనులు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను తొందరగా పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రెండు నెలల్లో పూర్తిచేస్తాం

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం అభివృద్ధి మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం. ఈ పనులకు ఇన్‌ఛార్జిగా 25 రోజుల క్రితం బాధ్యత తీసుకున్నాను. పనులు తొందరగా అయ్యేటట్లు పర్యవేక్షిస్తున్నాను.

పి.వి. గంగాధర్
జోన్ 3 ఇఇ

అప్పన్నను దర్శించుకున్న ఎన్నికల కమిషనర్

ప్రజాశక్తి-పెందుర్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని (రిటైర్డ్ ఐఎఎస్) దంపతులు శనివారం శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్.సుజాత సాదరంగా స్వాగతం పలికారు. వారు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అప్పన్న దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు, పిఆర్ఓ నాయుడు, ఏఈఓ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1, 2 రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నుంచి ఐఎఎస్‌గా ప్రమోషన్ పొందిన అధికారులు ఇండక్షన్ శిక్షణ, అధ్యయన పర్యటనలో భాగంగా శనివారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిఇఒ రాధ సాదర స్వాగతం పలికారు. వారు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనం ఇప్పించారు. స్వామివారి శేష వస్త్రములతో సత్కరించి, స్వామివారి పటం, ప్రసాదాలను అందజేశారు.

గొందేసి ప్రభాకర్‌రెడ్డికి ఘన నివాళి

గొందేసి ప్రభాకర్‌రెడ్డికి సంతాప సభలో మాట్లాడుతున్న తిప్పల నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్ ఐఎన్‌టియుసి నాయకులు గొందేసి ప్రభాకర్‌రెడ్డికి పలువురు ఘన నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన ప్రభాకర్‌రెడ్డికి శనివారం జివిఎంసి 75వ వార్డు పరిధి పెద్దగోరాడలో సంతాప సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య హాజరై ప్రభాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నిర్వాసిత కాలనీలో మంచి పేరున్న వ్యక్తి ప్రభాకరరెడ్డి అని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన అన్ని పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్మిక నాయకునిగా పేరు సంపాదించారని తెలిపారు. అలాంటి వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, గుడివాడ అమ్మన్న, పిట్ట ప్రకాష్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, ఐఎన్‌టియుసి, వైసిపి, కాంగ్రెస్, నిర్వాసిత సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలపై దృష్టి

ప్రజాశక్తి-సీతమ్మధార : గౌతమ బుద్ధుని బోధనలపై ప్రజలు దృష్టిసారించాలని పలువురు వక్తలు సూచించారు. బుద్ధుని జయంతిని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యాన డాక్టర్ ఎల్‌బి కాలేజీ ఆవరణలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన 'బుద్ధుని బోధనలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తొలుత బుద్ధుని చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆచార్య పెద్దయ్య మాట్లాడుతూ, ప్రపంచ శాంతిని కాపాడటానికి బుద్ధుని బోధనలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఎస్ఎన్.మూర్తి, నరసింహారావు, జోష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలతో బిసి సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-సీతమ్మధార : కూటమిలో ఉండే మూడు పార్టీలకు సంబంధించిన ప్రతినిధులతో కూటమి బిసి సంఘాన్ని ఏర్పాటుచేసినట్లు కన్వీనర్ నన్ మూర్తి, కో-కన్వీనర్ బల్లా శంకర్, టి.శ్యామ్‌సుందర్ తెలిపారు. సీతమ్మధారలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, కులగణన విషయంలో కేంద్రం త్వరితగతిన తేదీ ప్రకటించాలని కోరారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఒబిసి జాబితాను కులగణనకు ముందే పెండింగ్‌లో ఉన్న జాబితాకు మోక్షం కలిగిస్తూ కేంద్రం నిర్ణయం చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉత్తరాంధ్రకు చెందిన శిష్టకరణాలు, కళింగ వైశ్యులు, సొండి, అరవ, తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేరుస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలో వెనుకబాటు తనంతో ఉండే కులాలకు ఓబిసి ద్వారా న్యాయం జరిగే అవకాశం ఉందని, సామాజికంగా ఆర్థికంగా స్థిరపడేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కుల గణనకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందించే విషయంలో ఆధార్ కార్డుకు కులాన్ని లింక్ చేస్తూ ప్రజల నుంచే కుల సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పంపించేందుకు వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని నూతన కూటమి సంఘానికి పూర్తిస్థాయి మద్దతు ప్రకటిస్తామని చెప్పారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

యలమంచిలి : విద్యార్థులకు వేసవి సెలవుల్లో వివిధ రకాల విజ్ఞాన, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి వి.ఆనందకుమార్ తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా యోగ, చెస్, కథల పఠనం, స్పీకింగ్ , మ్యూజికల్ చైర్ మొదలైన కార్యక్రమాలు రిటైర్డు హెడ్ మాస్టర్ వై.అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో శనివారం కొత్తపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చిన్ని శ్రీనివాసరావు మాట్లాడారు. చదువుతోపాటు ఆటలలోను కూడా ప్రావీణ్యత ఉండాలని సూచించారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి కే. జగన్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని చిన్నదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం రిసోర్స్ పర్సన్ రమణమ్మ విద్యార్థులకు కుట్లు, అల్లికలపై శిక్షణ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు క్రాఫ్, కాగితాలపై నేర్చుకుని, ప్రదర్శించారు.

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో శనివారం అంత్యాక్షరి, మ్యూజికల్ చైర్స్, మూకాభినయం తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం పర్సులు, కాగితపు పువ్వుల తయారీపై జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి పర్యవేక్షణలో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ బాలలచే కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి, జాతీయ సేవా పథకం వాలంటీర్లు సునీత, జ్యోతిర్మయి సమన్వయం చేశారు. ఇండోర్ గేమ్స్‌పై జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఐవిఎస్ భాగ్యలక్ష్మి వివరించారు.

బహుమతులు అందజేస్తున్న భాగ్యలక్ష్మి, అనసూయాదేవి, గ్రంథాలయాధికారి

పిల్లలకు శాస్త్రీయ దృక్పథం అలవర్చాలి

- అందుకు ఎసిసి విజ్ఞాన శిబిరాలు దోహదం
-చిల్డ్రన్స్ క్లబ్ రాష్ట్ర కన్వీనర్ కోరెడ్ల రమాప్రభ

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చాలని చిల్డ్రన్స్ క్లబ్ రాష్ట్ర కన్వీనర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. పిల్లల్లో శాస్త్రీయ, విజ్ఞానదాయక విషయాలపై మరింత లోతుగా అవగాహన కల్పించేందుకు, టీవీ, మొబైల్ లాంటి సాధనాలకు బానిసలు కాకుండా ఉంచేందుకు అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 23 వరకు చోడవరం కో-ఆపరేటివ్ కాలనీలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐదు రోజులు పాటు పిల్లలను ఎంతో అలరించే విధంగా మంచి కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులను రమాప్రభ అభినందించారు. వివిధ రకాల మైండ్ గేమ్‌లతో పాటు క్రాఫ్ట్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, యోగా, సైన్స్ ప్రయోగాలు, కథ చెప్పుదాం, అభ్యుదయ గీతాలు ఆలాపన, మ్యాజిక్ షోలు, ఆటలు పాటలతో ఈ ఐదు రోజులు పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకోవవడంతోపాటు ఆనందంగా గడిపారు. దీనికి నిర్వాహకులుగా కె.గోవింద మాస్టారు వ్యవహరించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని నిర్వాహకులు తెలిపారు.

శుక్రవారం వెంకటేష్ నాయక్ శ్రీరామ్ శాస్త్రిల మ్యాజిక్ షోలు పిల్లలను ఎంతో అలరించాయి. ఐదు రోజులపాటు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన క్రాఫ్ట్ టీచర్ జ్యోతిర్మయి, హ్యాండ్ రైటింగ్ నగేష్, మ్యాజిక్ షో మాస్టర్స్ నాయక్, శాస్త్రి, కథ చెబుదాం మాస్టర్ వాసు తదితరులను కండువాలతో సత్కరించారు. ఐదు రోజులు పాటు పాల్గొన్న పిల్లలందరికీ బహుమతుల ప్రదానం చేశారు. క్లబ్ ఆవిర్భావానికి సూచికంగా రమాప్రభ కేకును కోశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు వరలక్ష్మి, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, ప్రేమ్ చంద్రశేఖర్, రైతు సంఘం నాయకులు ఎస్‌వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రజాల ప్రదర్శనలో మెజీషియన్

డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

బహుమతులు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఐద్వా జెండా ఆవిష్కరణలో పాల్గొన్న యువ మహిళా కార్యకర్తలు

మహిళా హక్కుల పరిరక్షణకు ఉద్యమం : ఐద్వా నేత రమాదేవి

ప్రజాశక్తి- మునగపాక

మహిళల హక్కుల సాధన, పరిరక్షణకు ఉద్యమం చేపట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గల డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో ఐద్వా 5వ రాష్ట్ర మహిళా చైతన్య శిక్షణా తరగతులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా డి.రమాదేవి ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించారు. శిక్షణ తరగతుల ప్రారంభంలో అమరులైన ఐద్వా కార్యకర్తలకు, నాయకులకు ఘన నివాళులర్పించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపైనా, మహిళల శ్రమ దోపిడీపైనా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 24 నుండి 26 వరకు జరిగే ఈ శిక్షణ శిబిరాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి యువ మహిళలు పాల్గొన్నట్లు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ప్రధాన కార్యదర్శి డిడి వరలక్ష్మి, నాయకులు ఆర్ లక్ష్మి, వాణి, జి సుభాషిణి, సిహెచ్ మంగతాయారు, సత్యవతి, గౌరీ, సూర్య ప్రభ తదితరులు పాల్గొన్నారు.

2న 'ఆపరేషన్ కగార్ లోగుట్టు' పై జిల్లా సదస్సు

ప్రజాశక్తి, అనకాపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ లోగుట్టు అనే అంశంపై జూన్ రెండో తేదీన అనకాపల్లిలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్టు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. సదస్సుకు సంబంధించిన కరపత్రలాను సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివారం స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ప్రొఫెసర్ కె మురళి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు వివిఎస్ కృష్ణ, ఏపీ ఆదివాసి సంఘం గౌరవ అధ్యక్షులు పిఎస్ అజయ్ కుమార్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వియ్యపు రాజు, కోరిబిల్లి శంకర్రావు, విత్తనాల పోతురాజు, ముత్తూర్తి సూరిబాబు, ఈగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది : బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం బుచ్చియ్యపేట, వడ్డాది గ్రామాల్లో మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు తమరాన దాసు, జి కోటేశ్వరరావు, దొండా సన్యాసిరావు, టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్, దొండా గిరిబాబు, కోరుకొండ కామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే శనివారం నూకాంబిక కళ్యాణమండపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందడానికి ఈ శిక్షణ ఎంత ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి నూకాలమ్మ, ఎంపీడీవో ఆంజనేయులు, పిఓపిఆర్డి మహేష్, ఈవో నారాయణరావు, గవర్ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి నాగ గంగాధర్, సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, ఎంపీటీసీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చీపురు పట్టి ఊడ్చుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

మెగా క్లీనింగ్ డ్రైవ్

ప్రజాశక్తి అచ్యుతాపురం : అచ్యుతాపురం ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మెగా క్లీనింగ్ డ్రైవ్ శనివారం ఉదయం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. అచ్చుతాపురం జంక్షన్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. మోసయ్యపేట ఫిషింగ్ మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల నుంచి ఖాళీ వాటర్ బాటిల్స్, ప్యాకెట్స్ బయట వెయ్య వద్దన్నారు. 300 మంది వాలంటీర్లు ఈ డ్రైవ్లో పాల్గొన్నారు.

శానిటేషన్ సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ వార్డు పరిధిలో పని చేస్తున్న శానిటేషన్ ఔట్సోర్సింగ్ సిబ్బంది 16 మందికి, విలీన గ్రామాల్లో సిబ్బందికి సబ్బులు, నూనెలను 84వ వార్డు ఇంచార్జ మాదంశెట్టి నీలబాబు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ గణేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, చూచుకొండ రమణ, శానిటరీ సిబ్బంది గణేష్ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సామగ్రి అందిస్తున్న నీలబాబు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ దినకర్

15 శాతం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్థికాభివృద్ది 15శాతం లక్ష్యంగా పనిచేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పథకాలు రూపొందించాలని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అనకాపల్లి కలెక్టరు కార్యాలయంలో శనివారం కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో దినకర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఇప్పుడున్న సవాళ్లను అధిగమించి విజయవంతంగా "వికసిత అనకాపల్లి జిల్లా"గా రూపుదిద్దడవమే లక్ష్యంతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉపాధిహామీపథకంలో పనిదినాలు కల్పన, మెటీరియల్ కాంపోనెంట్ లో లక్ష్యాన్నిమించి పనిచేసినందుకు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. 2019 - 24 మధ్య జరిగిన అవకతవకలు, ప్రస్తుత అమలు తీరు, ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ అమలు తీరు, గ్రామీణసడక్ యోజన, లాక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, కుసుమ్, పీఎంఆవాసయోజన, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం స్వనిధి వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు, పర్యాటక రంగం అభివృద్ధి, ఆరోగ్యం కోసం చెక్కర స్థానంలో వినియోగించే విధంగా తాటి బెల్లం - ఆర్గానిక్ బెల్లం ఉత్పత్తికి అనకాపల్లి బ్రాండ్ ఇమేజ్ కల్పన దిశగా కార్యచరాణ తదితర అంశాలపైన జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంటు కార్పొరేషను ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎపి స్టేట్ హౌసింగు కార్పొరేషను ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కొప్పులవెలమ కార్పొరేషను ఛైర్మన్ పి.వి.జి.కుమార్, ఎపి గవర కార్పొరేషను ఛైర్మన్ మల్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషను డైరెక్టరు ఈర్లె శ్రీరామ్మూర్తి, డిఆర్ఓ వై. సత్యనారాయణరావు, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్, డ్వామా ప్రోజెక్టు డైరెక్టరు ఆర్. పూర్ణిమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు, సివిల్ సప్లయి జిల్లా మేనేరు పి.జయంతి, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి బి. రామమోహనరావు, ఎపి టిడ్కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.సంధ్య, ఎపిఇపిడిసిఎల్, సూపరింటెండెంటు ఇంజనీరు అనకాపల్లి జి.ప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోజెక్టు డెరెక్టరు కె. శచీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుళాయి వద్ద చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం సంత అర్చ వద్ద కుళాయ వద్ద అశుభ్రత ఉండడంతో జనసేన నాయకులు కర్రి గోవింద ఆధ్వర్యంలో శనివారం పరిశుభ్రత చేసి బ్లీచింగ్ జల్లారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సత్యారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేయాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మపంచాయితీ శివారు కళ్యాణి గుమ్మి గ్రామానికి రోడ్డు సౌకర్యం నిమిత్తం అటవీ శాఖ అనుమతులు ఇచ్చి వెంటనే రోడ్డు పనులు ప్రాంభించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజనులు శనివారం చిన్న పిల్లలతో సహా అర్ధనగ్నంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు దండాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నేరెళ్ల పూడి నుండి కల్యాణి గుమ్మి వరకు బిటి రోడ్డు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అయితే అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యం లేక పిల్లలు స్కూల్‌కు వెళ్లాలన్నా, గిరిజనులు రేషన్ సరుకులు తెచ్చుకోవాలన్నా, అనారోగ్యం సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి లేక 108, 104 వంటి సౌకర్యాలు అందడం లేదన్నారు. అడవులు నాశనం చేస్తున్న కార్పొరేట్ సంస్థలకు అడవులు కట్టబెడుతున్న ప్రభుత్వం, గిరిజనులకు మౌలిక సౌకర్యాలు కొరకు రోడ్డు కోసం అనుమతులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం, అధికారులు తమ సమస్య పట్ల సానుకూలంగా స్పందించి అటవీ అనుమతులు మంజూరు చేసి రోడ్డు వేయాలని కోరారు. వీరి ఆందోళనకు ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానికులు సీదరి కొండబాబు, వంతల బోడెన్న, సికోడి బోడన్న, సోముల అప్పలస్వామి, జన్నిజోగిపోయ నాగేశ్వరరావు, పోయి రామూర్తి, వంతల సూరిబాబు, సూకూరి కొండమ్మ, అధికసంఖ్యలో గిరిజనులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

గోచీలు పెట్టుకొని, అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు


మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నేత దేముడు

బెల్ట్ షాపులున్న గ్రామాల్లో సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : బెల్ట్‌షాపులున్న గ్రామాల్లో సర్పంచ్‌లో చెక్ పవర్ తొలగించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం బెల్ట్ షాపులు అమ్మకాలు సాగిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్మూలించ కూడదని ఒకపక్క చెపుతూ మరో పక్క అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో వీఆర్ఏలు, మహిళా పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో ఉన్న మద్యం షాపులను అరికట్టడానికి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. వంద రూపాయలు ఉన్న మద్యం బాటిల్ రూ.130కు, రూ.160 బ్రాండ్ రూ.190కు, రూ.200 సీసా రూ.250 వరకు బెల్ట్ షాపుల్లో అమ్మకాలు సాగించి జనం డబ్బులు గుంజుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎయు డిగ్రీ ఫలితాల్లో డివిఎన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఫైనల్ ఫలితాలలో స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో బీకాం కంప్యూటర్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జె కార్తీక్, ఆర్ వెంకట లక్ష్మీ ప్రసన్న అత్యధిక గ్రేట్ పాయింట్లు 9.00 సాధించి యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం నిరంతరం విద్యార్థుల భవిష్యత్తు కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయా మాధురి, యు.నాగేశ్వరరావు, ఎస్ఎస్ జమీర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీను బాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2023లో జరిగిన బదిలీల్లో వీరంతా ఊహించని విధంగా ఎటువంటి సదుపాయాలు లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయ్యారన్నారు. ఇందులో 50 ఏళ్లకు పైబడి వయస్సు కలిగిన మహిళలు, భార్యాభర్తల ఉద్యోగుల్లో ఒకరు ఉన్నారని తెలిపారు. అనారోగ్యాల బారిన పడిన వారు కూడా ఉన్నారు. వీరికి న్యాయం చేస్తామని విద్యాశాఖ మంత్రి పలు పర్యాయాలు హామీ ఇచ్చారని,దానిని అమలు చేయాలని కోరారు.

'నాన్న నేనొచ్చేస్తా' నాటికకు బహుమతి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట అశోక ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటికల పోటీల్లో శుక్రవారం రాత్రి గుంటూరు శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా నాటికకు బహుమతి దక్కింది. నటి, నటులకు బహుమతులు ఆర్ఐసిఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు చేతులు మీదగా అందజేశారు, ఈ కార్యక్రమంలో బలరామ స్వామి, మారిశెట్టి వెంకట దేవి నాయుడు పాల్గొన్నారు.

నాటిక బృందానికి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు

మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, 45 సంవత్సరాల పైబడి ఉన్న సుమారు 750 మంది పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ముఖ్య అతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పని ఒత్తిడితో పాటు శారీరక మానసిక ప్రయాసలకు లోనవుతున్న సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ ఆసుపత్రిలో గుండె, కిడ్నీ, మహిళలకు మామోగ్రఫీ తదితర ఖరీదైన 13 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం, వేంకోజిపాలెంలో ఉన్న మెడికవర్ హాస్పిటల్, అచ్యుతాపురానికి చెందిన బుషిల్ డెకర్స్ లిమిటెడ్ సహకారంతో ఈ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈనెల 24 నుండి ప్రారంభించి ప్రతి రోజు 50 మంది చొప్పున పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈసందర్భంగా డిఐజి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, పోషకాహారం, మితాహారం, వ్యాయామం, సానుకూల దృక్పథంతో జీవించాలని సూచించారు. ప్రారంభ రోజు 50 మంది సిబ్బందికి విజయవంతంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ సిహెచ్.అరుణ్ కుమార్, బుషిల్ డెకర్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఏకె.రాయ్, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డిటిసి డీఎస్పీ బి.మోహనరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, బాల సూర్యారావు, అప్పలనాయుడు, నరసింగరావు, రామకృష్ణ, మన్మధరావు, ఎస్సైలు ఆదినారాయణ, విశ్వనాథం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల రక్షణపై శక్తి టీమ్ అవగాహన

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శక్తి టీమ్ సభ్యులు విద్యార్థులకు రక్షణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కశింకోట ఏఎస్ఐ ఎన్.మణికుమారి మాట్లాడుతూ ఆకతాయిల నుంచి బాలికలు ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. ప్రతి బాలిక యోగా చేయాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎస్ఐ మణికుమారి

ఎండియు వ్యవస్థ రద్దుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎండియు వ్యవస్థను రద్దు చేసి డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించడంపై రేషన్ డీలర్ల యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం రింగ్ రోడ్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను వారు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కడిమిశెట్టి గాంధీ, దాడి రమణ, పెంటకోట నాయుడు, దయాల్ రాజు, కరణం శ్రీను, కొణతాల బుజ్జి, కాశి విశ్వనాథం, చింతల సత్తిబాబు పాల్గొన్నారు.

కౌన్సిలర్లుపై సన్నగిల్లుతున్న ప్రజా విశ్వాసం

- రెండు విరుద్ధ అవిశ్వాస తీర్మానాలపై 9 మంది కౌన్సిలర్లు సంతకాలు
- చైర్ పర్సన్ నేతృత్వంలో మరో అవిశ్వాసానికి సిద్ధం?

ప్రజాశక్తి - యలమంచిలి

రాజకీయపార్టీల గుర్తులపై పోటీ చేస్తే నమ్మి గెలిపించిన ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ స్వార్థం కోసం యలమంచిలి మున్సిపాలిటీలో కౌన్సిలర్లు ఇష్టానుసారం పార్టీలు మారుతుండడంతో వారిపట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. నెల రోజుల వ్యవధిలో రెండు పరస్పర విరుద్ధ పార్టీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలపైనా 9మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారంటే ఆ కౌన్సిలర్లు ఎంతటి దిగజారుడుగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు.

మున్సిపాలిటీలో ఉన్నది 25 మంది కౌన్సిలర్లు. వీరిలో తెలుగుదేశం తరుపున ఒకరు, ఇండిపెండెంట్‌గా ఒకరు గెలవగా, మిగిలిన 23మంది వైసిపి తరుపున గెలిచిన కౌన్సిలర్లు. ఈ 23మందిలో చైర్‌పర్సన్ పార్టీ మారి బిజెపిలో చేరడంతో ఆమెకు వ్యతిరేకంగా ఏప్రిల్ నెల 22న వైసిపి ఇచ్చిన అవిశ్వాస నోటీసుపై 18 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. తరువాత వైస్‌ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తాలకు వ్యతిరేకంగా చైర్‌పర్సన్ నేతృత్వంలో కూటమి పార్టీలు మే 8వ తేదీన ఇచ్చిన అవిశ్వాస నోటీసులపై 16 మంది సంతకాలు చేశారు. ఉన్న 25 మంది కౌన్సిలర్లు వైసిపి ఇచ్చిన నోటీసుపై 18 మంది, వ్యతిరేక కూటమి పార్టీలు ఇచ్చిన నోటీసుపై 16 మంది సంతకాలు చేశారంటే వీరిలో 9 మంది కౌన్సిలర్లు రెండు నోటీసులపైనా సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ 9మంది ఎవరన్నదీ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇద్దరు వైస్ ఛైర్మన్లపై ఇచ్చిన అవిశ్వాస నోటీసులు అసంపూర్ణంగా ఉన్నాయంటూ తిరస్కరించబడ్డాయి. వైస్ చైర్మన్ -2 ఆరెపు గుప్తా పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కాకపోవడంతో వైస్ చైర్మన్-1 బెజవాడ నాగేశ్వరరావుపై అవిశ్వాస నోటీసు ఇవ్వడానికి ఇప్పుడు చైర్‌పర్సన్ నేతృత్వంలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరి ఆ నోటీసుపై మరెంతమంది కౌన్సిలర్లు సంతకాలు చేస్తారో వేచి చూడాలి. తాము ఓటు వేసి గెలిపించిన కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగిపోయి అవిశ్వాస కార్యక్రమాల్లో పాల్గొన్న తీరు పట్ల ప్రజల విశ్వాసం కోల్పోయారని చెప్పవచ్చు. రెండు వర్గాల తరపునా ఓటు వేసిన కౌన్సిలర్లపై ప్రజలు తీవ్ర అవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ మరొక్కటి గమనించాల్సి ఏమిటంటే... యలమంచిలి గ్రామపంచాయితీ 2012లో గ్రేడ్ త్రీ మున్సిపాలిటీగా అవతరించిన తరువాత తొలి మున్సిపల్ కౌన్సిల్‌కు చైర్‌పర్సన్‌గా తెలుగుదేశం తరపున ఎంపికైన రమాకుమారి, రెండో కౌన్సిల్‌కు వైసిపి తరపున కూడా ఆమె చైర్‌పర్సన్ అయ్యారు. ఇప్పుడు మూడో కౌన్సిల్‌కు బిజెపి తరపున చైర్‌పర్సన్‌గా పోటీ పడ్డానికి ఆమె అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

సత్తాచాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఆంధ్ర విశ్వవిద్యాలయం 2022-2025 డిగ్రీ బ్యాచ్‌కి విడుదల చేసిన ఫలితాలలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామకృష్ణారెడ్డి తెలిపారు. మాకిరెడ్డి జయంతి బి.ఎస్.సి విభాగం యూనివర్సిటీ 2వ ర్యాంక్, జిల్లా మొదటి ర్యాంక్, బి.బి.ఎ విభాగంలో నక్కా షారా జిల్లా 2వ ర్యాంక్, సయ్యద్ గుల్ఫిషాన్, మద్దూరి కాశీ అన్నపూర్ణ జిల్లా 3వ ర్యాంక్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె . నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం వివేకానంద డిగ్రీ కళాశాలలో బిఎ చదివిన విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు ప్రిన్సిపాల్ వై అప్పారావు శనివారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ నర్సీపట్నం వివేకానంద డిగ్రీ కాలేజి విద్యార్థినులు ఎం లక్ష్మీ ప్రసన్న రాణి బీఏ గ్రూపులో 9.23 మార్కులు ఆంధ్రయూనివర్సిటీ పరిధిలో ప్రథమ ర్యాంక్, వివిఎల్ మహతి బీఏ గ్రూపులో 8.92 మార్కులతో జిల్లాలో రెండవ ర్యాంక్ సాధించినదన్నారు. వీరిని వివేకానంద కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ ఏ ఎన్ ఎస్ జి దొరబాబు, డైరెక్టర్లు సునీల్ కుమార్, సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ వై వి భాస్కర్ బాబు అభినందించారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వర్మి కంపోస్టు ను పరిశీలిస్తున్న అధికారులు

సంపద తయారీ కేంద్ర పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో కాగిత గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్ శనివారం ఎంపీడీవో సీతారామరాజుతో కలిసి పరిశీలించారు. తడి,పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించి, సంపద తయారీ కేంద్రం నిర్వహణ పక్కాగా నిర్వహించాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. యోగాంధ్ర సర్వే, జి ఎస్ డబ్ల్యూ ఎస్ సర్వే, స్వర్ణ పంచాయితీలో హౌస్ టాక్స్ వసూలు, ఆధార్ లింక్, తదితర అంశాలపై సచివాలయ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈఓపిఆర్డి ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇంటింటికి వెళ్లి రేషన్ అందించే ఎండియు వాహనాలను కొనసాగించాలని శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు ఈ కార్యక్రమానికి హాజరై సంఘీభావంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో గద్దెనెక్కి నేటికీ హామీలు నెరవేర్చకపోవడం దారుణమని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేయడం సమంజసం కాదని, ఎండియు వాహనాల రద్దు నిర్ణయాన్ని పునరాలోచించాలన్నారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఇంటింటికి వాహనాలను రద్దు చేయడం తగదన్నారు. అనంతరం తహసీల్దార్ తిరుమల బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, వైసీపీ సీనియర్ నాయకులు రమేష్, ఎండియు వాహనదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివి , వైసిపి నాయకులు

మాట్లాడుతున్న డివి

కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో గొట్టువాడ గ్రామంలో వైసీపీ కార్యకర్త ఇంటిని రాజకీయ ఒత్తిడితో అధికారులు కూల్చివేత పట్ల మాజీ ఎమ్మెల్సీ డి వి సూర్యనారాయణరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వంలో మంజూరైన ఇంటి స్థలంలో వృధాగా ఉన్న సెంటు ప్రభుత్వ భూమి కలిసిందని కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే లబ్ధిదారుని ఇంటిని కూల్చడం అనేది సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ అధికారులు పేదల కట్టుకున్న ఇంటిపై ఇలాంటి దుశ్చర్యకు దిగడం సబబు కాదన్నారు. ఇటువంటి హేయమైన చర్యలకు దిగడం తగదని అధికారులు పునరాలోచించాలని తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ, ఎపిఒ

ఈ - శ్రమ్ కార్డులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో ఉపాధి హామీ శ్రామికులందరూ ఈ శ్రమ కార్డులను కలిగి ఉండాలని ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్నారావులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ శ్రమ కార్డు కలిగిన వారు ఎవరైనా అనారోగ్యంతో మరణిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి 2 లక్షలు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్డు కలిగి 60 ఏళ్ల వయసు దాటిన వారందరికీ ప్రతినెలా 3 వేల కార్మిక పెన్షన్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి హామీ శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఈ శ్రమ కార్డు ఉండే విధంగా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

విద్యా కిట్లను ముందస్తుగా అందజేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి:2026 విద్యా సంవత్సరంలో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను తక్షణమే అందజేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ స్వామి నాయుడు ఆదేశించారు శనివారం మండలంలో పర్యటించి కిట్లు భద్రపరిచి ఉన్న స్టాక్ పాయింట్లను పరిశీలించారు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికల బాలురులకు సంఖ్య ఆధారంగా కిట్లను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు అప్పగించాలని మండల విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె. బాలాజీ, స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ గణేష్, ఆంజనేయులు. రామకృష్ణ, సునీత పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సంబరపు ఒరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులతో యోగా ఆసనాములు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా చేస్తే శారీరక, మానసిక ప్రయోజనాలు ఎన్నో కలుగుతాయని చెప్పారు. ప్రతిరోజూ యోగా చేస్తే అనారోగ్యం వచ్చే అవకాశం తక్కువన్నారు.మానసిక ఒత్తిడి, అలసటతో బాధపడుతున్న వారు ప్రతిరోజు యోగా చేయాలని పేర్కొన్నారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు ప్రసాద్ మాస్టారు విద్యార్థులకు తెలుగు పదాలు ఇచ్చి వాటితో ఒక కథను రాయించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు వుంటాయని గ్రంథాలయాధికారిణి దమయంతి తెలిపారు.

అవంతిలో...

తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో యోగా శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు షరీఫ్ పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

కె.కోటపాడు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లతో శనివారం సమావేశం జరిగింది. సోమవారం నుండి ఈ నెల 30వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6 నుండి 8 గంటల వరకు మండలంలోని చౌడువాడ, కె.కోటపాడు, దాలివలస, పాతవలస, కొరువాడ ఈ ఐదు సచివాలయాల పరిధిలో యోగాసనాలపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ ప్రతినిధి హేమలత, ఎంఈఓ 2 సత్యనారాయణ, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ వేతలకు సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో యోగా చేయిస్తున్న శిక్షకులు

అనకాపల్లి : యోగాతో ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె లావణ్య పేర్కొన్నారు. యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో శనివారం 25 మంది యోగ గురువులచే 100 మంది మాస్టర్ ట్రైనీలకు యోగా ప్రోటోకాల్ ట్రెనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి కె మనోరామ జిల్లా, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కెవి జ్యోతి, ఆయుష్ విభాగం వైద్యాధికారులు, యోగా ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సబ్బవరం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి అన్నారు. యోగాంధ్ర 2025లో భాగంగా యోగ విద్యపై విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. అనంతరం జాతీయ యోగ విజేత పండూరి జయలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్స్ పాల్, బి.శంకర్, యం.రత్న ప్రకాష్, ఎన్ఎస్ఎస్ పిఓ గణేష్ లెక్చల, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కార్యదర్శి

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట గ్రామంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గ్రామ సర్పంచ్ దాసరి సూర్యకుమారి, పంచాయతీ కార్యదర్శి రాజుబాబు ఆధ్వర్యంలో శనివారం పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. యాదవ కాలనీలో కుళాయిల వద్ద చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందన్నారు. గ్రామ పుర వీధులలో వీధి రోడ్లు రెండు వైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యకరంగా ఉండాలంటే ఇంటితో పాటు గ్రామ పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉన్నప్పుడే విష జ్వరాలకు దూరంగా ఉండవచ్చునన్నారు.

విద్యుత్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-మాడుగుల:గత వారం రోజుల కిందట ఈదురుగాలులతో కురుసిన భారీ వర్షానికి గాదిరాయి గ్రామంలో నాలుగు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేల కొరగడంతో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోయారు. 20 కుటుంబాలు విద్యుత్తు లేక వారం రోజులుగా అంధకారంలోనే గడుపుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

ఎమ్మెల్యే రాజుకు రేషన్ డీలర్ల సత్కారం

ప్రజాశక్తి- రావికమతం:తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించిన కూటమి ప్రభుత్వానికి డీలర్ల సంఘం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. గత ఐదేళ్లలో డీలర్లు పడ్డ ఇబ్బందులను శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఎండియు వ్యవస్థను రద్దు చేస్తూ రేషన్ షాపు డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టడంపై ఎమ్మెల్యేను సత్కరించారు. మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచి ఎన్నికల హామీని నిలబెట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రేషన్ డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ కార్యదర్శి నూకాల తల్లి మాట్లాడుతూ, రేషన్ కార్డు వినియోగదారులకు నిత్యావసర వస్తువులు సకాలంలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి నూకాలతల్లి, ట్రెజరర్ రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులు దేవుడు, నాగ సత్య వతి,గిరిబాబు, శ్రీదేవి, మారాజు, రాజు, దేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

పాడేరు: ప్రభుత్వ భూముల ఆక్రమణలను స్వాదీనంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఆక్రమణల దారులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ నుండి తహాశీలద్దారులు, ఎంపిడి ఓలు, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బంజరు, ప్రభుత్వ, నీటి పారుదల భూములు, చెరువులు ఆక్రమణలను ఈనెల 31లోపు గుర్తించి రిపోర్టులు సమర్పించాలని చెప్పారు. ఆక్రమణదారులకు ఫారం 7 నోటీస్ జారీ చేయాలని సూచించారు. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసాక ఎన్ని రోజుల్లో తొలగిస్తారని తహాశీల్దారులను ప్రశ్నించారు. ఎల్టి ఆర్ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాసితుల పునరావాస పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పోలవరం పునరావాస పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ వారం రోజుల్లో పునరావాస కాలనీలకు 12 గ్రామాలను తరలించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను ఎం. బుక్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్లు శౌర్యమన్ పటేల్ కల్పశ్రీ, చింతూరు పి ఓ అపూర్వ భరత్, డి ఆర్ ఓ కె.పద్మలత పాల్గొన్నారు.

అనంతగిరి:మండలంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఇన్ చార్చి తహసిల్దార్ ఎస్ మాణిక్యం. ఎంపీడీవో ఏ వివి. కుమార్ సమక్షన ప్రత్యేక సమావేశం జరిగింది.

ఉత్తేజంగా సమైక్యతా యాత్ర

-మత సామరస్యం, దేశ సమగ్రతను చాటిచెబుతూ విశాఖలో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం జరిగిన సమైక్యతా యాత్ర అందరిలో ఉత్తేజం నింపింది. మత సామరస్యం, దేశ సమగ్రతను చాటి చెబుతూ ఈ యాత్ర ఎంతో స్ఫూర్తివంతంగా సాగింది. జాతీయ జెండాలతో, చిన్నారుల కోలాట ప్రదర్శనతో ఆ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా మారింది. భారతదేశ చిత్రపటాన్ని చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్న ప్రజలంతా జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ప్రజలు నేడు ఎదుర్కొంటున్న ఉగ్రవాద సమస్యకు పాకిస్తాన్‌లోని మతోన్మాద ప్రభుత్వం ఒక కారణమైతే, మన దేశంలోని మోడీ పాలన విచ్ఛిన్నర పోకడలు మరో కారణమని తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనూ ఈ దేశంలో హిందూ ముస్లింలు ఐక్యంగా కలిసి ఉన్నారని, జాతీయోద్యమంలో పాల్గొని దేశాన్ని విముక్తి చేసిన చరిత్ర ఉందని గుర్తుచేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల ఐక్యతను చీల్చి వేస్తున్నాయన్నారు. దీంతో వైషమ్యాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. పహల్గాంలో దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను ఇంతవరకూ పట్టుకోలేని దుస్థితిలో మోడీ ప్రభుత్వం ఉందని, కనీసం ఈ ఘటనపై పార్లమెంట్‌నైనా సమావేశ పరచకపోవడం దారుణమని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు, నాయకులు ఎం.సుబ్బారావు, శ్రీనివాసరాజు, పైడిరాజు, బి.రమణి, బి.ఈశ్వరమ్మ, ఎం.రాంబాబు, డి.అప్పలరాజు, నరేంద్రకుమార్, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు పాల్గొన్నారు. ఆస్క్ సంస్థ విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.

నగరంలో సాగుతున్న ర్యాలీ

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాస్ పుస్తకాలను పునరుద్ధరించాలి

-గిరిజన రైతుల నిరసన

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట గ్రామంలో జరిగిన రీ సర్వేలో రద్దు పరిచిన గిరిజన రైతులకు పట్టా పాస్ పుస్తకాలను పునరుద్ధరించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు సమాల కళ్యాణం, రోబ్బా వరహాలుదొర, సమాల శంకర్రావు, రోబ్బ దేవుళ్ళు, రబ్బ నాగరాజు, తదితర గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గతంలో ప్రభుత్వం తమకు పట్టా పాసుపుస్తకాలు ఇచ్చిందన్నారు. వాటిని బేకాతర చేస్తూ రెవెన్యూ, సర్వే సిబ్బంది తమ పేర్లను తొలగించి, ప్రభుత్వ గయాల భూమిగా చూపించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల పేరున ఆన్లైన్, పాస్ పుస్తకాలు చేసి ఇవ్వడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి కుటుంబ సభ్యుల పేరున రెవెన్యూ సిబ్బంది నమోదు చేసిన భూమికి గతంలో పట్టా, ఆన్లైన్ ఏమీ లేదన్నారు. అటువంటి ప్రభుత్వ భూమికి ఇవేమీ లేకుండా ఏ రకంగా ఆన్లైన్ పాస్ పుస్తకాలు చేస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ తమ భూమికి ప్రభుత్వ గయాలు భూమిగా ఏ విధంగా చూపిస్తారని వారు ప్రశ్నించారు. తక్షణమే తమకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు పాస్ పుస్తకాల ఆధారంగా కొత్త పాస్ పుస్తకాలను అందజేయాలని, తమ పేరున ఆన్లైన్ నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమకు అన్ని హక్కులు కల్పించిన ప్రభుత్వం ఇలా చేయడానికి గల కారణం ఏమిటో రెవెన్యూ సిబ్బంది తక్షణమే తెలియపరచాలన్నారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ దృష్టికి తమ సమస్యను తీసుకు వెళ్లడానికి ఎట్టి పరిస్థితుల్లో వెనకాడబోమని వారు తెలిపారు. రీ సర్వేలో జరిగిన అక్రమాలపై రెవెన్యూ సదస్సులలో ఫిర్యాదు చేసుకున్నప్పటికీ నేటి వరకు వాటికి పరిష్కారం దొరకకపోవడం చాలా దారుణమని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పాస్ పుస్తకాలు చూపుతున్న గిరిజనులు

త్వరలో సిహెచ్‌సి అదనపు భవనం

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- మాడుగుల:నియోజకవర్గానికి ప్రధాన కేంద్రమైన మాడుగుల సిహెచ్‌సి భవనం పక్కన అనుబంధంగా రూ5.25 కోట్లతో ఆసుపత్రి అదనపు భవనాన్ని జూలై నెలలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం మాడుగుల సిహెచ్సి పక్కన నిర్మాణం చేపడుతున్న అదనపు భవనాన్ని ఆయన పరిశీలించారు. జరగాల్సిన పనులపై సి హెచ్ సి సూపరిం టెండెంట్ చంద్రశేఖర్ తో పాటు భావన నిర్మాణ కాంట్రాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ముఖద్వారానికి ఆనుకొని ఉన్న మాడుగుల నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమన్నారు. నూతనంగా నిర్మాణం చేపడుతున్న భవనానికి సంబంధించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే నెలాఖరు నాటికి పెండింగ్లో ఉన్న పనులన్నీ కూడా పూర్తి చేయాలని సూచించారు. ఏజెన్సీ ముఖద్వారం మాడుగులకు పాడేరు, చీడికాడ, రావికవతం మండలాలతో పాటు గిరిజన గ్రామాల నుండి కూడా అనేకమంది ప్రజలు ఆరోగ్య సమస్యలపై వస్తుంటారని తెలిపారు. ఈ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుండి ఆరోగ్య సమస్యలపై వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ప్రేమానురాగాన్ని చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేవుడు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, రంజిత్ వర్మ, లెక్కల కాశీ బాబు, మరువాడ ఈశ్వరరావు, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		